

అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై మంగళవారం విజయవాడకు చెందిన పంచమ వేదం నృత్యాలయం వారి సంప్రదాయ నృత్యం అలరించింది.



భూ యాజమాన్య హక్కులకు భంగం

భూమి యజమాని ఆమోదం లేకుండానే సాగుదారు హక్కుల కార్డుల జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై పలువురు అభ్యుదయ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

- 8లో..



'రిజిస్ట్రేషన్'లో ఇష్టారాజ్యం!

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారు చేసిన తప్పులు బయటకు పొక్కితే వెంటనే నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి రద్దు చేస్తున్నారు.

- 8లో..

న్యూస్‌రీల్

ఉరుకుంద హుండీ ఆదాయం రూ. 1.08 కోట్లు



కానుకల లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 1.08 కోట్లు వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. మంగళవారం స్థానిక కాలక్షేపవు మండపంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. నగదు రూపంలో రూ.1,08,99,118, వెండి 14.70 కేజీలు, బంగారం 61.200 గ్రాములు వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ సిబ్బందితో పాటు ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉపప్రధాన అర్చకుడు మహదేవస్వామి, హుండీ పర్యవేక్షణ అధికారి వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై విచారణ కమిటీ ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో జరిగిన ర్యాగింగ్ గురించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ విచారణ కమిటీ వేశారు. కమిటీలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. సాయిసుధీర్, డాక్టర్ పి. హరిచరణ్, హాస్టల్ (యూజీ మెన్స్) వార్డెన్, సైకియాట్రి హెచ్‌ఓడీ డాక్టర్ ఎన్. నాగేశ్వరరావు, వార్డెన్(యూజీ ఉమెన్స్), జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ మాధవీశ్యామల, ఆప్తామాలజీ ప్రొఫెసర్ డాక్టర్ యుగంధర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఇక్బాల్ హుసేన్ ఉన్నారు. వీరు మంగళవారం మధ్యాహ్నం ఫ్రెషర్స్‌ను పిలిచి తెల్లకాగితాలపై పేరు చెప్పకుండా, ర్యాగింగ్ ఏమైనా జరిగి ఉంటే వివరాలు రాయాలని సూచించారు. ఈ మేరకు విద్యార్థులు రాసిన కాగితాలను అధికారులు పరిశీలన చేస్తున్నారు. మరోవైపు ర్యాగింగ్ జరిగిందా లేదా అన్న విషయాలపై ప్రాథమిక విచారణ చేసి నివేదికను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు పంపించారు. ర్యాగింగ్ జరిగి ఉంటే నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని, ఇప్పటిదాకా అలా ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని ప్రిన్సిపాల్ ప్రకటించారు.

తుంగభద్రకు భారీగా వరదనీరు



తుంగభద్ర డ్యాం 24 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

హొళగుంద/కర్నూలు సిటీ: తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. గత కొద్దీ రోజులుగా డ్యాం ఎగువ భాగంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భారీగా నీరు వస్తుంది. మంగళవారం ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కులకు పైగా ఉండటంతో అధికారులు డ్యాం 24 గేట్లు ఎత్తి 1,01,628 క్యూసెక్కుల నీటిని నదికి వదిలారు. మరో 10,500 క్యూసెక్కులు కాలువలకు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 1,633 అడుగుల పూర్తి మట్టానికి గాను 1,631.92 అడుగులు, 105.788 టీఎంసీలకు గాను 101.461 టీఎంసీల వరకు నీరు ఉంది. ఎగువ నుంచి డ్యాంకు వచ్చే నీటిని వచ్చినట్టే దిగువకు వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీబీ బోర్డు అధికారులు ఇరు రాష్ట్రాల నది తీర గ్రామాల ప్రజలకు ముందుగానే ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. కర్నూలు జిల్లా ఎల్లెల్సీ పరిధిలోని ఆంధ్ర కాలువ సరిహద్దు 250 కి.మీ వద్ద 668 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

సీసీ రోడ్ల పనుల్లో ప్రగతి కనిపించాలి

- పీఐయూ ఈఈ ఎం రఘురామిరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ వారోత్సవాల్లో చేపట్టిన సీసీ రోడ్ల పనుల్లో ప్రతి వారం పురోగతి కనిపించాలని పీఐయూ ఈఈ ఎం రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణం విశ్వేశ్వరయ్య భవన్‌లోని తన చాంబర్‌లో తన పరిధిలోని డీఈఈ, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు, బనగానపల్లె, డోన్ సబ్ డివిజన్ల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.445 కోట్లతో 445 సీసీ రోడ్లు, రూ.3.40 కోట్లతో రెండు బీటీ రోడ్ల పనులు చేపట్టడం జరిగిందన్నారు. రోజు రోజుకు ఈ పనుల వేగాన్ని పెంచి నిర్ణీత సమయానికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. పనుల్లో నాణ్యత కచ్చితంగా పాటించేందుకు ఇం.ఇనీర్లు క్షేత్ర స్థాయి పర్యవేక్షణను పెంచాలన్నారు. సమావేశంలో పీఏ టు ఈఈ పీ శిల్పాశ్రీ, డీఈఈలు రామ్మోహన్, గంగాధర్, నాగశ్రీనివాసులు, మల్లికార్జున, మన్మథబాబు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పాలన గాడి తప్పుతోంది

పనుల్లేక కూలీలు, రైతులు వలస పోతున్నారు.. పారిశుద్ధ్యం లోపించి రోగాలు ప్రబలుతున్నాయి.. కొన్ని శాఖల్లో అవినీతి హెచ్చుమీరుతోంది.. విద్యాలయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ కార్యక్రమాలు సైతం సరిగా అమలు కావడం లేదు. అన్నింటికీ కీలక శాఖల్లో ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు కావడం. ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు దాటినా.. పాలన ఇప్పటికీ ముందుకు సాగడం లేదు. జిల్లాకు కొత్త కలెక్టర్లు, ఎస్పీలు రావడం మినహా కీలకశాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేరు. దీంతో ప్రభుత్వ కార్యక్రమాలు ముందుకు కదలడం లేదు. కనీసం రోజువారి పాలన సజావుగా సాగుతుందంటే ఒకటి కాదు.. రెండు కాదు.. 26 కీలకశాఖలకు జిల్లా అధికారులు లేరు. ఎక్కడి ఫైళ్లు అక్కడే నిలిచిపోయి జిల్లాలో పాలన అస్తవ్యస్తంగా మారింది.

– సాక్షిప్రతినిధి కర్నూలు



- జిల్లా వ్యాప్తంగా 26 కీలక శాఖలకు అధికారులు లేరు
- కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ఇన్‌చార్జ్‌ల తాత్సారం
- డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్, రిజిస్ట్రేషన్, ఐసీడీఎస్.. చాలా శాఖలకు ఉన్నతాధికారులు లేరు
- ఆర్‌ఐఓ, డీఎంఅండ్‌హెచ్‌ఓ పోస్టులు కూడా ఖాళీ
- జిల్లా కేంద్రంలోని పోస్టులకు మంత్రి టీజీ భరత్ లేఖ ఉంటేనే నియామక ఉత్తర్వులు
- ఒక్కో పోస్టుకు ఇద్దరు, ముగ్గురికి కూడా లేఖలు ఇచ్చిన వైనం
- రాష్ట్రస్థాయి అధికారులకూ తలనొప్పిగా మారిన వ్యవహారం

రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత ఉన్న జిల్లాలో కర్నూలు ఒకటి. దేశంలో కరువు దెబ్బకు మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, ఆదోని నియోజకవర్గాల నుంచి రోజూ వందల కుటుంబాలు పని లేక తెలంగాణ, కర్ణాటక, కేరళ ప్రాంతాలకు వలసపోతున్నారు. కనీసం వీరికి ఉపాధి హామీ పథకం ద్వారా పనిదినాలు కల్పించేందుకు అధికారులు లేరు. డ్వామా పీడీగా శివప్రసాద్ అనే



కోసిగి రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న వలస కూలీలు

పల్నాడు అధికారికి పోస్టింగ్ ఇచ్చారు. అయితే అతను కర్నూలులో రిపోర్ట్ చేయలేదు. రాజకీయ కారణాలతోనే అతని నియామకం ఆగినట్లు తెలుస్తోంది. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. జెడ్పీ విధులే ఈయనకు భారంగా ఉన్నాయి. డ్వామాపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేక పోతున్నారు. రైతులు, కూలీల వలసబాట పడుతున్నా ఉపాధిహామీ పథకం పనులు కల్పించలేకపోతున్నారు. రోజూ లక్ష నుంచి 1.50 లక్షల పనిదినాలు కల్పించాలి. ఇప్పుడు అన్ సీజన్ కావడంతో రోజుకు 50 వేల పనిదినాలు కల్పించడం డ్వామా లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే 21వ తేదీ 13,411 మంది, 13వ తేదీ 13,649 మందికి పని కల్పించినట్లు చూపిస్తున్నారు. ఇందులో కూడా 40–50 శాతం బోగస్ రిపోర్టింగ్ ఉంటుందని తెలుస్తోంది. కూలీలు పనికి రాకపోయినా కొన్ని చోట్ల మస్టర్‌లో వచ్చినట్లు చూపించి కూలీలకు 50 శాతం, స్థానికంగా ఉన్న టీడీపీ నేతలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు 50 శాతం పంచుకునేలా తప్పుడు అటెండెన్స్ వేస్తున్నట్లు సమాచారం. పూర్తి స్థాయి అధికారి లేకపోవడంతో దీనిపై ఎవ్వరూ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అలాగే డీఆర్‌డీఏ పీడీగా ప్రతాప్‌రెడ్డిని నియమించారు. తిరిగి ఇతన్ని తప్పించారు. మెప్మా పీడీగా నాగ శివలీల ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ 'లక్‌పతిదీదీ' అతీగతీ లేదు. స్త్రీ నిధి, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ఉన్నతితో పాటు బ్యాంకు లింకేజీ రుణాలు కూడా నెమ్మదించాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పథకాలు ముందుకు సాగడం లేదు.

రోగాల సీజన్.. వైద్యాధికారి లేని వైనం..

వర్షాకాలం సీజన్‌లో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి విషజ్వరాల వ్యాప్తి ఉంది. కానీ వైద్య ఆరోగ్యశాఖకు డీఎంఅండ్‌హెచ్‌ఓ లేరు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. గృహనిర్మాణశాఖకు పీడీ లేరు. దేశంలో అత్యల్ప అక్షరాస్యతలో ఆదోని డివిజన్ ఒకటి. కోసిగి ప్రాంతంలో కనీసం 30 శాతం అక్షరాస్యత కూడా లేదు. సమగ్రశిక్ష అభియాన్ ఏపీఓతో పాటు ఇంటర్మీడియెట్‌ను పర్యవేక్షించే ఆర్‌ఐఓ కూడా లేరు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గురువయ్యశెట్టి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. రాయలసీమ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీకి వీసీలు లేరు. జలనరులశాఖకు చీఫ్ ఇంజినీర్‌తో పాటు ముగ్గురు ఎస్ఈలు కూడా లేరు. ఇలా 26 కీలక శాఖలకు అధికారులు లేక పూర్తిగా పాలన గాడి తప్పింది.

మంత్రి భరత్ సిఫార్సు లేఖ ఉంటేనే పోస్టింగ్!

కర్నూలు జిల్లాకు టీజీ భరత్ మాత్రమే మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యే భరత్ కావడంతో జిల్లా కేంద్రంలోని ఏశాఖలో పోస్టింగ్ కావాలన్నా మంత్రి భరత్ సిఫార్సు లేఖ తప్పనిసరి. దీంతో చాలా మంది భరత్ లేఖలను తీసుకుని పోస్టింగ్‌ల కోసం ప్రయత్నించారు. అయితే ఒక్కో పోస్టుకు 2, 3 లేఖలను భరత్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రాష్ట్రస్థాయి అధికారులు కూడా ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలో దిక్కుతోచని స్థితిలో కొన్ని పోస్టింగులపై నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది.

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న కీలక పోస్టుల వివరాలు

డిపార్ట్‌మెంట్	ఖాళీగా ఉన్న జిల్లా స్థాయి పోస్టు
ఎస్–ఎల్ఆర్	ఏడీ సర్వే–1
సెట్కూరు	చీఫ్ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్–1
ఐసీడీఎస్ (డీడబ్ల్యూ–సీడబ్ల్యూ)	ప్రాజెక్టు డైరెక్టర్–1
మెడికల్ – హెల్త్	జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి
డీటీడబ్ల్యూఓ	గిరిజన సంక్షేమ అధికారి
ఒకేషనల్ – ఎడ్యుకేషనల్	జిల్లా వృత్తి విద్య అధికారి
మత్స్యశాఖ	జాయింట్ డైరెక్టర్–1
డీఆర్‌డీఏ	ప్రాజెక్టు డైరెక్టర్–1
ఇంటర్మీడియెట్	ఆర్ఐఓ
ఆర్‌డబ్ల్యూఎస్	సూపరింటెండెంట్ ఇంజనీర్–1
ఎస్ఎస్ఏ	అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్
మైనార్టీ	ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ (మైనార్టీ) కార్పొరేషన్–1
పోలీస్	అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్–1
ఎంఏ – యూడీ	ఎస్ఈ, టిడ్కో–1
స్పోర్ట్స్	డీఎస్‌డీఓ
డ్వామా	ప్రాజెక్టు డైరెక్టర్–1
గృహనిర్మాణశాఖ	ప్రాజెక్టు డైరెక్టర్–1
పర్యాటకశాఖ	మేనేజర్, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్–1
స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్	జిల్లా రిజిస్ట్రార్–1
జిల్లా రెవెన్యూ శాఖ	డీఆర్ఓ
జలవనరులశాఖ	సీఈ, కర్నూలు సర్కిల్ ఎస్ఈ, ఎస్ఆర్‌డీసీ–2, ఎస్ఈ, తెలుగుగంగ
రాయలసీమ యూనివర్సిటీ	వైస్ చాన్స్‌లర్
ఉర్దూ యూనివర్సిటీ	వైస్ చాన్స్‌లర్

బేరసారాలు కూడా ప్రధాన కారణమే..



సిఫార్సు లేఖ ఉన్నప్పటికీ సెక్రటేరియట్‌లో పోస్టును బట్టి సమర్పించుకుంటేనే ఫైలు ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌పైకి చేరుతుందని ఆశావహులైన అధికారులంతా చర్చించుకుంటున్నారు. కొందరు డబ్బులు ఇచ్చిన తర్వాత ఆయా శాఖకు ప్రాతినిధ్యం వహించే మంత్రి మరో పేరు సిఫార్సు చేయడంతో డబ్బులిచ్చిన వారికి పోస్టింగ్ ఇవ్వలేక, శాఖకు సంబంధించిన మంత్రి ప్రతిపాదించిన వ్యక్తికి పోస్టింగ్‌లు ఇవ్వలేక ఇబ్బంది పడుతున్న ఘటనలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కీలకమైన శాఖలకు రూ.20 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకూ పోస్టింగ్ ఆశిస్తున్న అధికారులు ఖర్చు చేయాల్సి వస్తుందని అధికారులు చర్చించుకుంటున్నారు. ఈ కారణాలతోనే కీలకమైన 26 శాఖల నియామకాలు పెండింగ్‌లో పడినట్లు తెలుస్తోంది. ఇటీవల 32 మంది తహసీల్దార్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందారు. వీరికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు రెవెన్యూ శాఖలో ఎక్కడా ఖాళీలు లేవు. దీంతో వీరిని కూడా కొన్ని శాఖలకు డిప్యుటేషన్‌పై నియమించే యోచనలో ప్రభుత్వ ఉన్నట్లు తెలుస్తోంది.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు రక్షణ కరువు

- ఎన్నికల హామీలను గాలికొదిలిన పాలకులు
- ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు బనాయింపు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ఎక్కడ చూసినా ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. నాలుగు నెలలకే రాష్ట్రాన్ని నేరాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. కర్నూలు మొదలుకొని శ్రీకాకుళం వరకు రోజూ ఎక్కడో ఒక చోట ఆడపిల్లలపై అఘాయిత్యాలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల హామీలను పక్కనపెట్టి కక్ష సాధింపు చర్యలే లక్ష్యంగా అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తుండటం సిగ్గుచేటన్నారు. మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్లు ఆశ చూపి ఓట్లు వేయించుకుని, అధికారం చేపట్టి నాలుగు నెలలవుతున్నా వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రశ్నించేవారిపై అక్రమంగా కేసులు పెట్టి వేధించడం సిగ్గుచేటన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలోనే కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణ రెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సుబ్బరాయుడు, కరుణాకర్‌రెడ్డి, చందమామ బాబు, రవిరెడ్డి, జయచంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, రామలక్ష్మయ్య పాల్గొన్నారు.

బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలి

- ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు (టౌన్): యువతను బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులదేనని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఇంటర్మీడియెట్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థు లు రహదారి నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరం బారిన పడితే వెంటనే 1930కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్ బాబు, కమాండ్ కంట్రోల్ సీఐ శివశంకర్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐలు, సిల్వర్‌జూబ్లీ, ఉస్మానియా, కేవీఆర్, సెయింట్ జోసెఫ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు

- మహిళలపై దారుణాలు జరుగుతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, ఐదారు నెలలుగా ఏదో ఒకచోట వారిపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. కనీసం బాధితులను పరామర్శించడానికి కూడా సమయం లేదా అన్నట్లుగా కూటమి నేతలు మద్యం వ్యాపారం, ఇసుక దందాలో బిజీ బిజీగా గడుపుతున్నారన్నారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, హోంమంత్రి పని చేస్తున్నారా అనే అనుమానం వ్యక్తమవుతుందన్నారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను చూసి పక్క రాష్ట్రాల నుంచి విద్యార్థినులు చదువుకునేందుకు ఏపీకి రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారన్నారు. ముచ్చుమర్రి చిన్నారి అదృశ్యం మిస్టరీ ఇప్పటికీ వీడలేదన్నారు. జిల్లాలోని ఆలూరు, అవుకులో ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసి చంపేసినా కేసులు లేవన్నారు. కేసులు పెట్టకుండా బాధితులను బెదిరిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల వ్యవధిలోనే 76 మంది మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగాయన్నారు.

పవనూ.. ఎంత మందిని రక్షించావు..?

గతంలో 30 వేల మంది మహిళలు మాయమయ్యారని పదే పదే చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పటి వరకు ఎంత మందిని రక్షించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ మంత్రి లోకేశ్ ప్రత్యర్థులను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. పాత కేసులతో వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బంది పెట్టడం తప్పా.. ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు.

రోడ్డున పడిన బతుకులు

- రహదారి విస్తరణ పేరుతో దుకాణాల కూల్చివేత
- జీవనోపాధి కోల్పోయిన 50 కుటుంబాలు
- ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల డిమాండ్
- రద్దీ, ట్రాఫిక్ లేని చోట తొలగింపుపై సర్వత్రా విమర్శలు

ఆదోని రూరల్/సెంట్రల్: చిన్న చిన్న హోటళ్లు, చిరు దుకాణాలతో కుటుంబాన్ని పోషిస్తున్న పేద, మధ్య తరగతి వ్యాపారులు రోడ్డున పడ్డారు. రహదారి విస్తరణలో జీవనోపాధి కోల్పోయి లబోదిబోమంటున్నారు. ఆదోని పట్టణంలో భీమాస్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు దుకాణాలను మంగళవారం మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, సిబ్బంది సాయంతో బలవంతంగా తొలగించారు. టీ బంకులు, ఇతర దుకాణాలను జేసీబీతో కూల్చేశారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా డ్రైనేజీ కాలువ మీద చిన్న బంకులు వేసుకుని హోటళ్లు, టీస్టాళ్లు నడుపుతూ జీవిస్తుంటే వాటిని తొలగించడం ఎంత వరకు న్యాయమని వ్యాపారులు మండి పడుతున్నారు. షాపులను తొలగించాలని శనివారం చెప్పిన అధికారులు మంగళవారం జేసీబీ వచ్చి కూల్చే



జేసీబీతో దుకాణాలను తొలగిస్తున్న దృశ్యం



తొలగించిన దుకాణాలు

యడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత గడువు ఇవ్వడంతో పాటు, ప్రత్యామ్నాయం చూపితే దుకాణాలను తామే తొలగిస్తామని చెప్పినా వినకుండా దౌర్జన్యంగా కూల్చేయడంతో దుకాణ నిర్వాహకులు పురపాలక అధికారులతో వాగ్వావాదానికి దిగారు. తప్పనిసరిగా తొలగించాల్సిందే అంటూ అధికారులు రోడ్డుకు ఇరు వైపులా ఉన్న చిన్న షాపులు, షెట్టర్లు, చిన్న కొట్టం వంటి వాటిని కూల్చేశారు. అయితే ఆదోని ప్రధాన వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు ఉన్నా, నడి సెంటర్‌లో ఓ బిల్డింగ్‌ను అక్రమంగా కట్టినా వాటి జోలికి వెళ్లకుండా, పేదలపై ఎమ్మెల్యే ప్రతాపం చూపడం దారుణమన్నారు. నిరుపేదల ఉసురు ఎమ్మెల్యేకు తగులుతుందని దుమ్మెత్తి పోశారు. జనం రద్దీ, వాహనాల ట్రాఫిక్ లేని చోట ఆక్రమణల పేరుతో పేదల బంకులను తొలగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ విషయంపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి రాజేశ్వరిని వివరణ కోరగా.. ఎమ్మెల్యే, కమిషనర్ ఆదేశాల మేరకు రహదారి విస్తరణలో భాగంగా కూల్చివేతలు చేపట్టామని తెలిపారు.

ఎట్లా బతికేది



మా కుమారుడు వీరేష్ చిన్న బంకు పెట్టుకుని జీవనం సాగించే వాడు. అనారోగ్యంతో మృతి చెందాడు. మా కుమారుడుకు ఇద్దరు పిల్లలు. ఈ బంకులో చిన్న వ్యాపారం చేసుకుని ఉపాధి పొందుతున్నాం. ఇప్పుడు ఈ షాపు తొలగిస్తే జీవనాధారం కోల్పోతాం. ఏదో చిన్నా చితక వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించే మాలాంటి వారిపై ఇలా ప్రవర్తించడం తగదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

– శకుంతలమ్మ ఆదోని

కుటుంబాన్ని ఎలా పోషించాలి..



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు తమ్మన్న. ఇతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు. దాదాపు 30 ఏళ్లుగా ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా టీ, బజ్జీ స్టాల్ ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రహదారి విస్తరణలో వీరి దుకాణాన్ని తొలగించడంతో కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు. వారి తీరును చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు. ఇప్పటికే తనకు గుండె ఆపరేషన్ జరిగిందని, ఇక నుంచి తన కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని తమ్మన్న ఆందోళన చెందుతున్నాడు. ఎమ్మెల్యే, అధికారులు తమ లాంటి పేదల కడుపులు కొట్టడం దారుణమన్నారు.

ఇక్కడే చచ్చిపోతా..



చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడు భీమయ్య కొన్నేళ్లుగా స్టేట్‌బ్యాంక్ ఎదురుగా బంకు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాడు. భార్య జయలక్ష్మి కూడా దివ్యాంగురాలే. వీరికి ఇద్దరు సంతానం. తన కుటుంబానికి ఆధారంగా ఉన్న బంక్‌ను తొలగించవద్దంటూ మున్సిపల్ అధికారులను వేడుకున్నాడు. అయినా వారు వినలేదు. జేసీబీతో ముందుభాగం కొంత తొలగించారు. చివరకు ఇక్కడే చచ్చిపోతానని దివ్యాంగుడు గొంతు మీద కత్తి పెట్టుకోవడంతో తాత్కాలికంగా ఆ దుకాణాన్ని అధికారులు వదిలిపెట్టారు. మిగతా దుకాణాలను తొలగిస్తూ ముందుకు వెళ్లారు.

క్లుప్తంగా

నేడు ఆదోని మార్కెట్‌యార్డుకు సెలవు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం సెలవు ప్రకటించారు. సోమ, మంగళవారం కాటా వేసిన పత్తిని వ్యాపారులు వెంటనే ఫ్యాక్టరీలకు తరలించేందుకు వీలు కాలేదు. దిగుబడి అంతా యార్డులోనే ఉండటంతో బుధవారంరోజు వ్యాపారస్తులు తీసుకెళ్లడం కోసం సెలవుదినంగా ప్రకటించినట్లు యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. నేడు పత్తి దిగుబడులు క్రయ, విక్రయాలు మాత్రమే జరగవని, మిగతా పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలు యథావిధిగా జరుగుతాయని ఆయన వెల్లడించారు.

తగ్గిన పత్తి ధర

ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం పత్తి ధర రూ.200 వరకు తగ్గింది. సోమవారం 15,268 క్వింటాళ్ల పత్తి దిగుబడులు రాగా, గరిష్ట ధర రూ.7,789, మధ్య ధర రూ.7359, కనిష్ట ధర రూ.5109గా నమోదైంది. మంగళవారం 14,278 క్వింటాళ్ల పత్తి రాగా గరిష్ట ధర రూ.7,551, మధ్య ధర రూ.7,369, కనిష్ట ధర రూ.4,607గా నమోదైంది. సోమవారం రోజున పత్తి దిగుబడులకు ధర పెరగడంతో మంగళవారం ఎక్కువ సంఖ్యలో దిగుబడులు రావడంతో వ్యాపారస్తులు ధరను తగ్గించారు.

యువకుడిపై పోక్సో కేసు

ఎమ్మిగనూరు రూరల్: పట్టణానికి చెందిన గొల్ల కృష్ణ ఉరుకుందు అనే యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. బాలుడి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించటంతో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంగళవారం ఆయన విలేకరులకు వెల్లడించారు.

ఎరువుల దుకాణం తనిఖీ

మహానంది: గాజులపల్లెలోని శ్రీ రాఘవ ట్రేడర్స్ ఎరువులు, పురుగు మందుల దుకాణంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి మంగళవారం తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న వివరాలకు, క్షేత్రస్థాయిలో ఉన్నవాటికి వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి రూ.1,10,125 విలువ చేసే 5.25 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు నిలిపేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు విక్రయాలు జరిపితే సంబంధిత కొనుగోలుదారుల(రైతులు)తో సంతకాలు తీసుకోవాలన్నారు. ఈ పాస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువులను విక్రయించాలన్నారు.

నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

ఆస్పరి: మండల పరిధిలోని నగరూరు గ్రామానికి చెందిన ఉపేంద్ర, గోపి, శ్రీనివాసులు, వినోద్ అనే వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈనెల 18వ తేదీన నగరూరులో తిరుమలేష్ అలియాస్ సన్నీ అనే 17ఏళ్ల బాలుడు చిన్న వీరేష్ ఇంటి దగ్గరకు వెళ్లగా పై నలుగురు కులం పేరుతో దూషించి దాడి చేశారు. ఈ ఘటనపై తల్లి సుజాత సోమవారం ఫిర్యాదు చేయడంతో ఉపేంద్ర, గోపి, శ్రీనివాసులు, వినోద్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేశామని సీఐ మస్తాన్‌వలి తెలిపారు.

నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ,ఎస్ఐ

కోడుమూరు రూరల్: గూడూరులో సెప్టెంబరు 22వ తేదీన బోయ రవి అనే యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. పాతకక్షల నేపథ్యంలోనే ఈ యువకుడి హత్య జరిగినట్లు తేలింది. కోడుమూరు సీఐ తబ్రేజ్, గూడూరు ఎస్ఐ తిమ్మయ్య మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గూడూరు ఏబీఎం కాలనీకి చెందిన సంజ్యపోగు అలెగ్జాండర్‌కు హతుడు బోయ రవి మధ్య కొన్ని పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో రవిని అంతమొందించాలని అలెగ్జాండర్ పథకం వేసుకున్నాడు.సెప్టెంబరు 22వ తేదీన ఉదయం కల్లందొడ్డిలో పశువులకు మేత వేసేందుకు వెళ్లిన రవిని నిందితుడు హత్య చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న గూడూరు పోలీసులు అలెగ్జాండర్‌ను ఈనెల 21వ తేదీన అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు సీఐ వెల్లడించారు.

‘రిజిస్ట్రేషన్’లో ఇష్టారాజ్యం!

- సబ్ రిజిస్ట్రార్ల స్వార్థానికి క్రయ, విక్రయదారులు బలి
- అక్రమ రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయకుండా ఏళ్లపాటు తిప్పుకుంటున్న వైనం
- అదే వారు చేసిన తప్పులు బయటకు పొక్కితే క్షణాల్లో రద్దు
- రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల తీరుతో విస్తుపోతున్న విక్రయదారులు

☛ కల్లూరు సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని పందిపాడు గ్రామం సాయినాథ్ నగర్‌లో సర్వే నంబరు 10లోని 202ఏ, 202బీ, 202సీ ప్లాట్లను పేద పద్మశాలి కులస్తుల హాస్టల్, కల్యాణ మండపం కోసం 3929/1985గా 1985లో రిజిస్ట్రేషన్ చేశారు. దీనినే 2019లో కొందరు ఫేక్ దాక్యుమెంట్లతో అదే కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దాని డాక్యుమెంట్ నంబర్ 3519/2019ను రద్దు చేయాలని బాధితులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

☛ కర్నూలు రూరల్ మండలం పసుపల గ్రామ సర్వే నంబర్ 74/3లో ఏకే గ్రేస్‌కు 261 ప్లాటు ఉంది. దీనిని 2023 లో 6092/2023గా కొందరు సంబంధంలేని వ్యక్తులు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయాన్ని కొంత కాలానికి తెలుసుకున్న ఆస్తిపరులు అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని ఏడాదిన్నరగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. కనీసం ఏమి చేయాలో చెప్పడంలేదు.

☛ అదే అధికారుల అక్రమాలు బయటపడితే క్షణాల్లోనే అలాంటి రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తున్నారు. ఇందుకు ఇవే ఉదాహరణలు. కర్నూలు అర్బన్ మండలంలోని జొహరాపురం సర్వే నంబర్ 154–1లో ఫేక్ డాక్యుమెంట్లు చేసినట్లు బయటకు పొక్కడంతో క్షణాల్లో దాదాపు 15 డాక్యుమెంట్ల వక్ఫ్‌బోర్డు అధికారుల పేరుతో రద్దు చేయించారు. తాజాగా ఆదోనిలో ఎమ్మెల్యే అనుచరుడు ఫేక్ డాక్యుమెంట్ చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు మీడియాలో రావడంతో తక్షణమే ఆ డాక్యుమెంట్ 23947/2024ను రద్దు చేసినట్లు ప్రకటించారు.

కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్ల విషయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు వారికి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. వారు చేసిన తప్పులు బయటకు పొక్కితే వెంటనే నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి రద్దు చేస్తున్నారు. అదే విషయం బయటకు రాకపోతే తమకు అన్యాయం జరిగిందని బాధితులు ఏళ్లపాటు వారి చుట్టు తిరిగినా అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయడంలేదు.

బాధితులకు నిబంధనల పేరిట కాలయాపన

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో తప్పుడు డాక్యుమెంట్‌ను రద్దు చేయించుకోవాలంటే తలప్రాణం తోకకు వస్తుంది. ఏళ్లపాటు వారి చుట్టు తిరిగినా ఒక్క డాక్యుమెంట్‌ను రద్దు చేయించుకోలేరు. సవాలక్ష నిబంధనలు పెట్టి కాలయాపన చేస్తారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చేసిన తప్పులకు క్రయవిక్రయదారులు బలి అవ్వాల్సి వస్తోంది. నిబంధలను ప్రకారం తమకు రద్దు చేసే హక్కు లేదని చెబుతారు. ఫేక్ డాక్యుమెంట్లపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, కోర్టుకు వెళ్లి రద్దు చేసేలా ఆర్డర్ తెచ్చుకోమని సూచిస్తారు. కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో తప్పుడు డాక్యుమెంట్లను రద్దు చేయాలన్న ఫిర్యాదులు ఏడాదికి దాదాపు 25కుపైగా నమోదవుతాయి. వీటిపై ఏళ్ల తరబడి విచారణ కొనసాగుతునే ఉంటుంది.



కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయం

ఆగమేఘాల మీద రద్దు...

సబ్ రిజిస్ట్రార్లు తమ స్వార్థంతో ఒకరి ఆస్తులను మరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేస్తారు. ఎవరైనా దానిని తెలుసుకుంటే పని ఒత్తిడిలో చూసుకోలేదని చెబుతారు. ఇదే విషయాన్ని మీడియా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లితే మాత్రం ఆగమేఘాల మీద దానిని రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆదోనిలో జరిగిన దొంగ రిజిస్ట్రేషన్‌ను అదే మాదిరిగా రద్దుచేశారు. ఇటీవల కర్నూలు జొహరాపురంలోని 154 సర్వే నంబర్ విషయంలోనూ అదే జరిగింది. కాగా, ఒక డాక్యుమెంట్‌ను రద్దు చేయాలంటే క్రయ, విక్రయదారులు ఉండాలి. అయితే ఇక్కడ మాత్రం వారితో పనిలేకుండా ఆ భూమి వక్ఫ్‌ది కావడంతో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌తో దాదాపు10 డాక్యుమెంట్లను రద్దు చేయించారు. భవిష్యత్‌లో ఆ డాక్యుమెంట్లు కోర్టుల్లో నిలుస్తాయో లేదో చూడాల్సి ఉంది.

ఫేక్ డాక్యుమెంట్ రద్దు కోసం ఏడాదిగా తిరుగుతున్నా..



మాకు కర్నూలు రూరల్ మండలం పసుపల గ్రామ సర్వే నంబర్ 74/3లో 5 సెంట్ల స్థలం ఉంది. అయితే దానిని మాకు తెలియకుండా అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. ఎందుకు చేశారంటే ఎవరూ సమాధానం చెప్పడం లేదు. దానిని రద్దు చేయాలని జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశాం. దాదాపు ఏడాదిన్నరగా తిరుగతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఆఫీసుకు వస్తే కనీసం సమాచారం ఇవ్వడంలేదు.

–సుమతి లక్ష్మీరత్న, కర్నూలు

ఫేక్ రిజిస్ట్రేషన్‌పై అధికారులు స్పందించడం లేదు



కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పదుల సంఖ్యలో ఫేక్ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని ఫిర్యాదులు ఉన్నాయి. వాటిపై అధికారులు స్పందించడం లేదు. బాధితులు అడిగితే సరైన సమాధానం ఇవ్వడంలేదు. అదే వారు చేసిన తప్పులు బయటకు వస్తే మాత్రం ఆగమేఘాలపై రద్దు చేస్తున్నారు. వారు తప్పులు చేస్తే వెంటనే రద్దు అయ్యే డాక్యుమెంట్లు..బాధితులు అడిగినప్పుడు రద్దు చేస్తే ఎందుకు కావు.

– టి.లక్ష్మీనారాయణ, ఆర్టీఐ కార్యకర్త, కర్నూలు

అప్పుల బాధ తాళలేక ..



ఉప్పర చిన్నరంగయ్య(ఫైల్)

పెద్దకడబూరు: బతుకుదెరువు కోసం వలస వెళ్లిన హెచ్.మురవణి గ్రామానికి చెందిన ఉప్పర చిన్న రంగయ్య(35) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చిన్న రంగయ్య(35) స్థానికంగా అప్పులు ఉన్నాయి. వాటిని తీర్చేమార్గం కనిపించకపోవడంతో భార్య వీరేషమ్మ, పెద్ద కుమార్తెతో కలిసి ఆదివారం కర్ణాటక రాష్ట్రం మతమారి గ్రామానికి వలస వెళ్లాడు. సోమవారం అక్కడ పత్తి తీసే పనికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున నిద్రలేచి పనికి వెళ్దామని, త్వరగా తయారుకండి, అప్పటిలోగా ఊర్లోకి వెళ్లి టీ తీసుకొస్తానని భార్యతో చెప్పి బయటకు వెళ్లి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఈ విషయం తెలియని భార్య, కుమార్తె పనికి వెళ్లారు. తర్వాత స్థానికుల సమాచారంతో హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. అప్పుల భారంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం.

స్తంభించిన పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ–నామ్ సెంట్రల్ సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మార్కెట్ యార్డుల్లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు స్తంభించి పోయాయి. దేశవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఈ–నామ్ ద్వారా ఆన్‌లైన్ టెండర్ల ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. ఈ–నామ్‌కు సంబంధించి సెంట్రల్ సర్వర్‌లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కావడంతో ఆన్‌లైన్ టెండర్ల ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో మాన్యువల్‌గా టెండర్లు వేసి కొనడం వల్ల తీవ్ర జాప్యం జరిగింది. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో సోమ, మంగళవారాల్లో మాన్యువల్‌గా కొనుగోళ్లు నిర్వహించారు. సాంకేతిక సమస్యలు మరో రెండు,మూడు రోజులు ఉండే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు మార్కెట్‌కు ఈ నెల 24వ తేదీ వరకు ఉల్లి గడ్డలు మినహా ఇతరత్రా ఎటువంటి వ్యవసాయ ఉత్పత్తులను తీసుకురావద్దని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమీషన్ ఏజెంట్లు మార్కెట్‌కు ఉల్లి మాత్రమే తెప్పించాలని సూచించారు. ఈ నెల 25 నుంచి యథావిధిగా ఈ–నామ్‌లో క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం



మృతి చెందిన డ్రైవర్ సుదర్శన్‌రెడ్డి

కృష్ణగిరి: టెంపో వాహనం అదుపుతప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొన్న ఘటనలో డ్రైవర్ దుర్మరణం చెందాడు. కృష్ణగిరి మండల పరిధిలోని అమకతాడు టోల్‌గేట్ సమీపంలో ఈ ఘటన జరిగింది.ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన పేరం సుదర్శన్‌రెడ్డి(24) అనంతపురం చెందిన కొండశెట్టి శ్రీనివాసులు వద్ద (ఏపీ29టీబీ3869) టెంపో ట్యాక్సీ వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో అనంతపురం మార్కెట్ నుంచి వాహనంలో వేరుశనగ బస్తాలను లోడ్ చేసుకుని కర్నూలు మార్కెట్‌లో అన్‌లోడ్ చేసేందుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో ఐదున్నర గంటల సమయంలో అమకతాడు టోల్‌గేట్ సమీపాన ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌కు బండిని అదుపు చేసుకోలేక రహదారి మధ్యలోని డివైడర్‌ను ఎక్కించి సిమెంట్ దిమ్మెను ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ సుదర్శన్ రెడ్డి అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి పేరం ఈశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

గొర్రెల కాపరి అదృశ్యం



నరసయ్య(ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన కాటగేని లింగారెడ్డి, ముత్తమ్మ దంపతుల కుమారుడు కాటగేని నరసయ్య అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈనెల 17వ తేదీ నుంచి కనిపించడంలేదని మంగళవారం తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గొర్రెల కాపరిగా పనిచేసే ఈ యువకుడు వయస్సు 20 సంవత్సరాలు ఉంటుంది. రోజులాగే ఈనెల 17వ తేదీ న ఉదయం ఇంటి నుంచి గొర్రెలు మేపడానికి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల పొలాల్లో, ఇతర గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో తెలిపారు.

గొర్రెల పెంపకాన్ని లాభసాటి చేస్తాం

- ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ నూతన అధ్యక్షుడు శ్రీనివాసులు
- ఏకగ్రీవంగా యూనియన్ ఎన్నికలు జరిగినట్లు అధికారికంగా ప్రకటన



ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ పాలక వర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి దుర్గా ప్రసన్నబాబు

కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెల పెంపకాన్ని లాభసాటిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారల సహకార యూనియన్ అధ్యక్షుడు కె. శ్రీనివాసులు తెలిపారు. యూనియన్ నూతన పాలక వర్గం ఎన్నిక కోసం ఈ నెల 5వ తేదీన నామినేషన్లు స్వీకరించారు. 8వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ జరిగింది. 12 డైరెక్టర్ స్థానాలకు 30 మంది నామినేషన్‌లు దాఖలు చేయగా 18 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో ఏకగ్రీవ ఎన్నికలు జరిగినట్లుగా ఎన్నికల అధికారి డాక్టర్ దుర్గాప్రసన్నబాబు అధికారికంగా ప్రకటించారు. ఆఫీసు బేరర్ల ఎన్నిక కూడా ఏకగ్రీవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్ధ పశువైద్యశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన పాలక వర్గ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడుగా శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌గా బండి ఆత్మకూరుకు చెందిన బాలగుర్రప్ప యాదవ్, డైరెక్టర్లుగా మద్దిలేటి, రాముడు, అయ్యన్న యాదవ్, యుగందర్, ఎం.శ్రీనివాసులు, ఎస్.చంద్రశేఖర్, అనిమిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎం.మద్దయ్య, ఉపేంద్రస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన సల్కాపురం శ్రీనివాసులు మాట్లాడుతూ... గొర్రెల కాపర్లకు, గొర్రెలు, మేకలకు బీమా సదుపాయం కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొత్తగా గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ బంజరు భూములను గుర్తించి ప్రాథమిక సంఘాలకు కేటాయించే విధంగా చూస్తామన్నారు. నూతన పాలక వర్గం సభ్యులను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, శ్యాంబాబు, మాజీ అధ్యక్షులు నాగేశ్వరరావు యాదవ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పులికనుమ పైప్‌లైన్ లీకేజీ

- 50 ఎకరాల పంట పొలాలు నీట మునక



పైప్‌లైన్ లీకేజీతో ఎగిసిపడుతున్న నీరు

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం పొలాల్లో పులికనుమ రిజర్వాయర్‌కు సంబంధించిన పైప్‌లైన్ లీకేజీ అయ్యింది. నీరు భారీగా బయటకు వస్తుండటంతో పక్కనున్న పత్తి, మిరప పంటపొలాలు నీట మునిగాయి. తుంగభద్ర నది ఒడ్డున స్టేజ్ -1 పంప్ హౌస్ నుంచి దేవరబెట్ట గ్రామ పొలాల్లో ఏర్పాటు చేసిన స్టేజ్–2 పంప్‌హౌస్‌కు పైప్‌లైన్ ద్వారా నీటిని పంపింగ్ చేపడుతున్నారు. అయితే జంపాపురం పొలంలోని సాతనూరు గ్రామానికి చెందిన కురువ రమేష్ , రాముడు పొలంలో పంప్‌హౌస్ నుంచి 2.61 కిలోమీటర్ల వద్ద మంగళవారం మధ్యాహ్నం పైప్‌లైన్ లీకేజీ అయి చుట్టు పక్కల ఉన్న 50 ఎకరాల పత్తి, మిరప పొలాల్లోకి నీళ్లు చేరాయి. ఫలితంగా ఆయా పంటలకు తీవ్ర నష్టం వాటిలినట్లు రైతులు వాపోతున్నారు. అధికారులు పర్యవేక్షణ లోపంతోనే తరచుగా పైప్‌లైన్‌లు లీకేజీలు ఏర్పడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్ ఏఈ ప్రేమ్‌ను వివరణ కోరగా మాధవరం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ట్రిప్ కావడంతో పంపింగ్ ఒక్కసారిగా ఆగిపోయి రివర్స్ వాటర్‌తో లీకేజీ అయ్యిందని, వెంటనే నీటి పంపింగ్‌ను ఆపివేసినట్లు తెలిపారు.

జిల్లా వెబ్‌సైట్‌లో ఏఎన్‌ఎంల అర్హుల జాబితా

కర్నూలు (హాస్పిటల్): ఉమ్మడి జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు సంబంధించి మొదటి, రెండవ, మూడవ అభ్యర్థుల అర్హుల జాబితాను కర్నూలు జిల్లా వెబ్‌సైట్ https:// kurnool. ap. gov. in, నంద్యాల జిల్లా వెబ్‌సైట్ https:// nandyal. ap. gov. in లో ఉంచినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్‌ఎంలకు వారి ర్యాంకుల విషయంలో తలెత్తిన సందేహాలకు సంబంధించి వారి నియామకం సమయంలో మొదటగా 21–09–2019న ప్రభుత్వం నుంచి 2,735 మంది అభ్యర్థుల అర్హుల జాబితా అందిందన్నారు. అప్పటికే కొంతమంది కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్‌ఎంలుగా ట్రైబల్/రూరల్/అర్బన్ ప్రాంతాల్లో పనిచేస్తుండటంతో వారి సరీ్వసు మార్కులను సరిచేసి 2,742 మంది అభ్యర్థులతో కూడిన రెండవ అర్హుల జాబితాను పంపించారన్నారు. అప్పుడు చాలామంది అభ్యర్థుల ర్యాంకుల్లో మార్పు జరిగిందని తెలిపారు. మరలా ప్రభుత్వం పరీక్ష రాసిన అభ్యర్థులందరికీ 15 బోనస్ మార్కులు కలిపి 4,431 మంది అభ్యర్థులతో కూడిన మూడవ అర్హుల జాబితాను 30–10–2019 నాడు పంపించారని తెలిపారు. ఈనెల 19న విడుదల చేసిన ఏఎన్‌ఎం గ్రేడ్–3 గ్రామ, వార్డు సచివాలయం ఏఎన్‌ఎంల రివైజ్డ్ ప్రొవిజినల్ సీనియారిటీ లిస్టులో చూపించిన ర్యాంకులు ప్రభుత్వం నుంచి నియామకం సమయంలో మూడోసారి అందిన 4,431 మంది అభ్యర్థులతో కూడిన అర్హుల జాబితాలో ఉన్నవేనన్నారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదన్నారు. ప్రభుత్వం నుంచి అందిన మొదటి, రెండవ, మూడవ అభ్యర్థుల అర్హుల జాబితాలను ఏఎన్‌ఎం గ్రేడ్–3 ఉద్యోగులు సరిచూసుకోవాలని సూచించారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మహానంది: పాతసామాన్లు, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి జీవనోపాధి పొందుతున్న కొందరు ఆటోలో వెళ్తుండగా ఐచర్ వాహనం ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన ఘటన గిద్దలూరు రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. ఆంజనేయపురం గ్రామానికి చెందిన ఉసేనమ్మ, నాగసుంకమ్మ, రంగస్వామి గిద్దలూరు వెళ్తుండగా ఐచర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన ముగ్గురినీ రోడ్‌సేఫ్టీ విభాగం ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయాన్ని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

నల్లమల ఘాట్‌లో బైక్‌ను ఢీకొన్న కారు

నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో పచ్చర్ల దాటిన తర్వాత కారు బైకును ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న గిద్దలూరుకు చెందిన ముజీబ్ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి కారులోనే తీసుకుని వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

ప్రైవేటు గోదాములో భారీ అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

ఆళ్లగడ్డ: మండల పరిధిలోని నల్లగట్ల గ్రామంలో ఉన్న ప్రైవేటు గోదాములో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు 3,335 సంచుల జొన్నలు దగ్ధం అయినట్లు బాధితులు తెలిపారు. నల్లగట్ల గ్రామంలోని రామలింగయ్యకు చెందిన ప్రైవేటు గోదాములో రైతులు ధాన్యం నిల్వ ఉంచుకున్నారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి గోదాములో నుంచి మంటలు వస్తుండటంతో అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి గోదాము యజమాని రామలింగయ్యకు సమాచారం ఇచ్చాడు. అతడు అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా గోదాములో సుమారు 3,335 సంచుల జొన్నలు దగ్ధమమై, రూ.4 కోట్ల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు అగ్నిమాపక శాఖ అధికారి వీరారెడ్డి తెలిపారు.

భూ యజమానుల హక్కులకు భంగం

- పరస్పర అంగీకారంతోనే కౌలు కార్డులు జారీ చేయాలి
- ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం -2024 అభిప్రాయ సేకరణలో రైతులు





నూతన కౌలుదారు చట్టంపై అధికారులు, రైతులతో మాట్లాడుతున్న జేసీ నవ్య

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం -2024 కింద భూమి యజమాని ఆమోదం లేకుండానే సాగుదారు హక్కుల కార్డుల జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై పలువురు అభ్యుదయ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పరస్పర అంగీకారంతో సాగుదారు హక్కుల కార్డు జారీ చేయాలని.. అలా కాకుండా ఇస్తే సమస్యలు ఉత్పన్నమమవుతాయని హెచ్చరించారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం కౌలుదారు చట్టం -2019ని రద్దు చేసిన కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం -2024 తయారు చేస్తోంది. ఇప్పటికే ముసాయిదా చట్టాన్ని తయారు చేసిన వ్యవసాయ శాఖ శాసనసభలో చట్టం తయారు చేయడానికి ముందు ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఉమ్మడి కర్నూలు, ఉమ్మడి అనంతపురం జిల్లాల వ్యవసాయ అధికారులతో కర్నూలులోని ఉద్యాన భవన్‌లో అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈ కార్యక్రమంలో జేసీ నవ్యతో పాటు వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. నూతన సాగుదారుల హక్కుల చట్టం 2024 ముసాయిదా చట్టంలోని అంశాలను అడిషనల్ డైరెక్టర్ వివరించారు. భూ యజమాని సంతకం లేకుండానే కౌలుదారు సాగుదారు హక్కుల కార్డు కోసం రైతుసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తర్వాత గ్రామసభ ఆమోదంతో కార్డు జారీ అవుతుందని తెలిపారు. దీనిపై భూ యజమానికి అభ్యంతరం ఉంటే ఏడీఏకు అప్పీల్ చేసుకోవచ్చని సూచించారు. భూ యజమానుల హక్కులకు భంగం కలిగే విధంగా ఉన్న ఈ చట్టాన్ని సదస్సులో పలువురు రైతులు వ్యతిరేకించారు. నూతన చట్టం అమలైతే యజమానులు తమ భూములను కౌలుకు ఇవ్వలేరన్నారు. జేసీ నవ్య మాట్లాడుతూ... నూతన చట్టం ద్వారా సాగుదారు హక్కుల కార్డు జారీలో రెవెన్యూ ప్రమేయం ఉండదని, వ్యవసాయ శాఖనే జారీ చేస్తుందని తెలిపారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు కూడా నూతన సాగుదారు చట్టంపై అవగాహన కల్పించడానికి ప్రయత్నించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనరేట్ డీడీఏ పద్మావతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల డీఏఓలు పీఎల్ వరలక్ష్మి, మురళీకృష్ణ, ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, ఎల్‌డీఎం రామచంద్రరావు, నాలుగు జిల్లాల నుంచి వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.